నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, శుక్రవారం 20 డిసెంబర్ 2024 | MEDAK

దేవాదుల పనులకు రూ.178 కోట్లు కేటాయించాలి

- జనగామ ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి విజ్ఞప్తి

చేర్యాల, డిసెంబర్ 19: జనగామ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసేందుకు పెండింగ్‌లో ఉన్న దేవాదుల పనులకు రూ.178 కోట్లు కేటాయించాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. దేవాదుల వద్ద నాలుగు పంపులు ఆన్ చేసి నియోజకవర్గంలోని చెరువులు నింపాలన్నారు. 499 ఎకరాల భూమి సేకరిస్తే జనగామకు కిందభాగంలో ఉన్న ఆలేరు నియోజకవర్గానికి నీళ్లు వస్తాయన్నారు. వెంటనే నిధులు రిలీజ్ చేసి పనులు ప్రారంభించాలన్నారు. మోటర్లు ఆన్ చేసి కొమురవెల్లి మండలంలోని తపాస్‌పల్లి రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు విడుదల చేయాలని కోరారు. గతంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో దేవాదుల పెండింగ్ పనులపై సమస్యలు తెలియజేశామన్నారు. మంత్రి నిర్వహించిన సమావేశంలో మిగిలిపోయిన ప్యాకేజీ ఎనిమిదిలో, ప్యాకేజీ ఏడులో, ప్యాకేజీ రెండుకు సంబంధించి కొద్దిగా భూమిని సేకరించాల్సి ఉన్నదని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. దేవాదులకు సంబంధించి 3,400 ఎకరాల్లో 2,972 ఎకరాలు సేకరించారని, ప్యాకేజీ 8లో 430 ఎకరాలు, ప్యాకేజీ 7లో 36 ఎకరాలు, ప్యాకేజీ 2లో 33తో కలిపి 499 ఎకరాలు సేకరించాల్సి ఉన్నదన్నారు. దీనికి సంబంధించి రూ.178 కోట్లు కావాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశామని ఎమ్మెల్యే తెలిపారు. నిధులు విడుదల చేసి భూమిని సేకరిస్తే జనగామతో పాటు ఆలేరు నియోజకవర్గానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తపాస్‌పల్లి పైపు లైన్లు ఓపెన్ చేసి నీటిని తరలించుకుపోవడంతో జనగామ నియోజకవర్గంలో చెరువులు నిండడం లేదన్నారు. ఆలేరు వాళ్లు నీళ్లు తీసుకుపోవడం వల్ల వారికి, మాకు ఘర్షణ తలెత్తుతుందన్నారు. ధర్మసాగర్ నుంచి గండిరామారం తర్వాత తపాస్‌పల్లి మొత్తం రిజర్వాయర్లు నింపితే యాసంగికి సంబంధించి చెరువులకు నీళ్లు వస్తాయన్నారు. సిస్టమ్ రెడీగా ఉన్నప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదని, నాలుగు పంపులు ఉంటే ఒక పంపు సగం రోజు ఆన్ చేస్తున్నారని, అన్ని పంపులు ఆన్ చేస్తే రిజర్వాయర్లు నిండి రెండు నియోజకవర్గాల్లోని అన్ని చెరువులు నిండుతాయని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు.

ఎనగుర్తిలో కొత్తరాతి యుగం ఆనవాళ్లు

దుబ్బాక, డిసెంబర్ 19: సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలోని అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఎనగుర్తి గ్రామంలో కొత్తరాతి యుగం ఆనవాళ్లను చరిత్ర పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్ గుర్తించారు. ఎనగుర్తిలో కాశీవిశ్వనాథ స్వామి ఆలయం సమీపంలోని బండల మీద పురాతన మానవులు ఆహార సేకరణలో భాగంగా ఉపయోగించే రాతి పనిముట్లు(రాతి గొడ్డళ్లు) నూరుకున్న నూరుడు గుంతల(గ్రూవ్స్)ను గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కొత్తరాతి యుగం నాటి ఆది మానవులు ఎక్కువగా రాతి పనిముట్లు తయారు చేసుకుని జీవనాన్ని కొనసాగించాని తెలిపారు. రాతి పనిముట్లతోనే వ్యవసాయం చేశారని పేర్కొన్నారు. బండ మీద దాదాపు 20కిపైగా (గ్రూవ్స్) నూరిన గుంతలు ఉన్నాయని, వీటి ఆధారంగా ఈ ప్రాంతం వేలఏండ్ల నుంచి మానవులకు ఆవాసంగా ఉన్నదని వివరించారు.

అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఎనగుర్తిలో కొత్తరాతి యుగం ఆనవాళ్లు

రోడ్డు పనులకు బ్రేక్

- కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి పనులను పక్కనపెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- రూ.15 కోట్లతో పనులు ప్రారంభించిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- కొనసాగని పనులు- అవస్థలు పడుతున్న ప్రజలు
- ప్రభుత్వం పనులు ప్రారంభించాలంటున్న గిరిజనులు

ఆగిపోయిన నారాయణఖేడ్-మాసాన్‌పల్లి డబుల్ లేన్ రోడ్డు పనులు

నారాయణఖేడ్, డిసెంబర్ 19: బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామీణ రహదారులకు పెద్దపీట వేసి, దశలవారీగా రోడ్ల అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు కేటాయించి తదనుగుణంగా పనులు చేపట్టింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నది. నిధుల కొరతను సాకుగా చూపుతూ కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను ఒక్కొక్కటిగా పక్కనపెట్టే విధంగా వ్యవహరిస్తున్నది. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నుంచి మాసాన్‌పల్లి వరకు డబుల్ లేన్ రోడ్డు ఏర్పాటుకు కేసీఆర్ ప్రభుత్వం తొలిదశలో సిర్గాపూర్ వరకు 12 కిలోమీటర్ల డబుల్ లేన్ రోడ్డు నిర్మాణానికి రూ.15 కోట్లు మంజూరు చేసి పనులు సైతం ప్రారంభించింది. ఇక్కడి ప్రజలు పడుతున్న అవస్థలను గుర్తించి అప్పటి ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి.. కేసీఆర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించిన మేరకు నిధులు మంజూరయ్యాయి. తదనంతరం ఎన్నికలు జరిగి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ఈ రోడ్డు పనులకు బ్రేక్ పడింది. బిల్లులు రావనే భయంతో సదరు కాంట్రాక్టర్ పనులు చేపట్టడం లేదు. ప్రభుత్వ పెద్దలు కానీ ప్రజాప్రతినిధులు కానీ సదరు కాంట్రాక్టర్‌కు భరోసా కల్పించకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. ఇక గ్రామాలకు డబుల్ లేన్ రోడ్డు ఏర్పడి రవాణా సౌకర్యం మెరుగుపడుతుందనే ఆయా గ్రామాల ప్రజల మురిపెం ముణ్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. ఈ రోడ్డు ఏర్పాటైన పక్షంలో చాంద్‌ఖాన్‌పల్లి, స్కూల్ తండా, శివారుసందు తండా, మిట్యా నాయక్ తండా, తుర్కపల్లి తండా, తుర్కపల్లి, గంగాపూర్, ర్యాకల్, పోతన్‌పల్లి, చల్లగిద్ద తండా, జీవులా తండా, సిర్గాపూర్, లక్ష్మణ్‌నాయక్ తండా తదితర గ్రామాలకు ఈ రోడ్డు సదుపాయం అనువుగా ఉండేది. కామారెడ్డి జిల్లా పిట్లం వెళ్లేందుకు సైతం ఈ రోడ్డు ఉపయోగపడుతుంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రూట్లో ప్రజల ఇబ్బందులను దూరం చేయాలనే సదుద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన ఈ రోడ్డు పనులు కాస్త కాంగ్రెస్ ప్రభుత్వ పుణ్యమా అని ఆగిపోవడంతో ప్రజలు మండిపడుతున్నారు. రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరి వాహనాలు నడపడం కష్టతరమై, తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ ఇబ్బందులను గమనించి ప్రభుత్వం వెంటనే పనులను ప్రారంభించాలని వారు కోరుతున్నారు.

నారాయణఖేడ్-మాసాన్‌పల్లి డబుల్ లేన్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న అప్పటి మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి (ఫైల్)

నారాయణఖేడ్-సిర్గాపూర్ మధ్య నిలిచిపోయిన డబుల్ లేన్ రోడ్డు పనులు

రోడ్డు పనులు ప్రారంభించాలని ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఈఈ నర్సింహులును కోరుతున్న బీఆర్ఎస్ నాయకులు(ఫైల్)

ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన రోడ్డు పనులు నిలిచిపోవడానికి ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం. అభివృద్ధి పనులకు నిధులు తేవడంలో, పనులు చేపట్టే కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించే విషయంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపేవారు. ఆ ప్రయత్నాలేవి ఇప్పుడు కనిపించడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన పనులపై ప్రస్తుత ప్రభుత్వం వివక్ష చూపుతున్నట్లు కనిపిస్తుంది. పనులు ప్రారంభించిన దశలోనే ఆగిపోవడంతో ఈ రూట్లో రాకపోకలు సాగించే వాహనదారులకు ఇబ్బందులు కల్గుతున్నాయి. బైకులు బోల్తాపడి ప్రమాదాలు జరిగిన సందర్భాలు కూడా ఉన్నాయి. పనులను ప్రారంభించి ప్రజల ఇబ్బందులు తీర్చాలి.

– రవీందర్‌నాయక్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ మాజీ సభ్యుడు, సంగారెడ్డి జిల్లా

తొందరగా రోడ్డు వేస్తే బాగుంటది

ఏడాది క్రితం రోడ్డు పనులు మొదలుపెట్టి ఆపేసింద్రు. రోడ్డంతా గుంతలు పడి శాన కష్టమైతుంది. ఆటోలు, బస్సులు, సైకిల్ మోటర్లు నడవనికే ఎంతో కష్టమైతుంది. మొదలు పని చేసి తర్వాత పని ఆపేసింద్రు. మాది తుర్కపల్లి తండా రోడ్డుకే ఉంటది. పెద్ద రోడ్డు ఏస్తున్నరని ఎంతో సంతోసపడ్డం. గని పనులే చేస్తలేరు. ఈ రోడ్డు పోడ్డ ఉన్న తండాలు, ఊర్లకు పెద్ద రోడ్డు సౌలత్ అయితదనుకుంటే పనులే సాగ్తలేవు.

– లక్ష్మీబాయి, తుర్కపల్లి తండా, సంగారెడ్డి జిల్లా

22న మెదక్ జిల్లాకు గవర్నర్

- మెదక్ చర్చి, కొల్చారం సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులతో ముఖాముఖి

మెదక్ చర్చిలో ప్రెసిడెంట్ శాంతయ్యతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈనెల 22న మెదక్ జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. మెదక్ చర్చితోపాటు కొల్చారం మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థినులతో ముఖాముఖి నిర్వహించనున్నారని తెలిపారు. మెదక్ చర్చిలో ముందస్తు ఏర్పాట్ల కోసం మెదక్ ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు, చర్చి ప్రెసిడెంట్ శాంతయ్య, సెక్రెటరీ బోనితో కలిసి కలెక్టర్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రూట్ మ్యాప్, పార్కింగ్, చర్చి ఆవరణలో ఏర్పాట్లపై చర్చి నిర్వాహకులు, అధికారులతో చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. మెదక్ చర్చి ఈనెల 25 వరకు వందేండ్లు పూర్తి చేసుకుంటుందన్నారు. జిల్లాలో ఉన్నతాధికారులు, పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుందన్నారు. 22న గవర్నర్ పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లలో లోటుపాట్లు కలగకుండా చర్యలు చేపట్టామని చెప్పారు.

అధికారుల తప్పిదంతో
అందని ద్రాక్షలా పథకాలు

ఒకే గదిలో నివాసం ఉంటున్న ప్రమీల



దరఖాస్తు చేసుకున్న ప్రజాపాలన రసీదు

వెల్దుర్తి, డిసెంబర్ 19: అధికారుల తప్పిదంతో పేదలకు పథకాలు అందని ద్రాక్షలా మారుతున్నాయి. ప్రభుత్వ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్నా ఆన్‌లైన్ నమోదులో అధికారుల తప్పిదంతో నిరుపేదలకు ఇబ్బందులు తప్పడం లేదు. మెదక్ జిల్లా వెల్దుర్తి పట్టణానికి చెందిన కిచ్చుగారి ప్రమీల భర్త నర్సింహులు పదేండ్ల క్రితం మృతిచెందాడు. అత్తగారి కుటుంబం ఆదరించకపోవడంతో కూలీ పనులు చేసుకుంటూ ఉన్న ఇద్దరు కూతుళ్ల వివాహాలు చేసింది. కొన్నేండ్ల క్రితం రోడ్డు ప్రమాదం జరగడంతో తీవ్ర గాయాల పాలై చావుబతుకుల నుంచి బయటపడింది. అనంతరం ఒకే గదిలో ఉంటూ, ప్రభుత్వ పెన్షన్, చిన్నచిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నది. ప్రభుత్వం ఫిబ్రవరిలో చేపట్టిన ప్రజాపాలనలో గ్యాస్ రాయితీ, మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకుంది. దరఖాస్తు రసీదులో సైతం వాటి వివరాలను నమోదు చేయగా, దరఖాస్తును పరిశీలించిన అధికారులు ప్రజాపాలన రసీదును ప్రమీలకు అందజేశారు. అనంతరం దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదులో ఆపరేటర్లు, పర్యవేక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహించడంతో ప్రమీల దరఖాస్తు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదు. దీంతో ప్రభుత్వం అమలు చేస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వర్తించలేదు. ప్రతినెలా కరెంట్ బిల్లు చెల్లిస్తుండగా, గ్యాస్ రాయితీ రావడం లేదు. ఇందిరమ్మ ఇంటి సర్వేలో సైతం పేరు రాలేదు. ప్రభుత్వ పథకాలకు అన్ని అర్హతలు ఉన్నా అధికారుల తప్పిదంతో రావడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేసి పథకాలను వర్తింపచేయాలని ప్రమీల విజ్ఞప్తి చేశారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల భారీ ర్యాలీ

సిద్దిపేటలో భారీ ర్యాలీ చేపడుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

సిద్దిపేట, డిసెంబర్ 19: కొంతకాలంగా సమ్మె చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు గురువారం సిద్దిపేటలో భారీ ర్యాలీ చేపట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తానని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి ఇప్పుడు ఎందుకు చేయడం లేదని ఉద్యోగులు ప్రశ్నించారు. సిద్దిపేట పట్టణంలో సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ముస్తాబాద్ చౌరస్తా నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి పెద్దఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు రోజుల్లో స్పష్టమైన జీవో విడుదల చేయకుంటే సమ్మెను ఉధృతం చేస్తామని సమగ్ర శిక్షా ఉద్యోగులు హెచ్చరించారు. సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

పారిశుధ్య కార్మికుడి మృతిపై విచారణ

- మృతుడి కుటుంబానికి త్వరలో బెనిఫిట్స్ అందిస్తాం
- కేంద్ర సఫాయి కర్మచారి కమిషన్ చైర్మన్ వెంకటేశం

సంగారెడ్డి కలెక్టరేట్‌లో విచారణ చేస్తున్న జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ చైర్మన్ వెంకటేశం, అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్

బొల్లారం డిసెంబర్ 19: విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు మృతిచెందిన పారిశుధ్య కార్మికుడి కుటుంబానికి రావాల్సిన బెనిఫిట్లను త్వరలో అందజేస్తామని బొల్లారం మున్సిపల్ కమిషనర్ మంగతాయారు తెలిపారు. గురువారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జాతీయ సఫారీ కర్మచారి కమిషన్ చైర్మన్ వెంకటేశం కార్మికుడి మృతిపై విచారణ చేపట్టారు. పారిశుధ్య కార్మికుడు లంబాడి నరసింహ నవంబర్ 11న విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు మృతిచెందిన ఘటనపై జిల్లా, మున్సిపల్ అధికారులు, కుటుంబ సభ్యులతో జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ విచారణ జరిపిందన్నారు. విచారణలో భాగంగా మృతుడి కుటుంబానికి అందించాల్సిన బెనిఫిట్లను త్వరలో అందిస్తామన్నారు. కార్మికుడి మృతిపై మున్సిపల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ రోజాబాల్‌రెడ్డి అధ్యక్షతన అత్యవసర సమావేశం నిర్వహించారని, ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సూచన మేరకు డబుల్ బెడ్రూమ్, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం అందించేందుకు కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం చేసిందని చెప్పారు. ఈఎస్ఐ, పీఎఫ్ బెనిఫిట్లను ఫోరెన్సిక్ రిపోర్టు అనంతరం ఈపీఎఫ్ రూ.2,700, ఈఎస్ఐ రూ.14,800 ప్రతినెలా పెన్షన్ రూపంలో కుటుంబానికి అందిస్తామని చెప్పారు. కుటుంబంలో ఇద్దరికి రూ.700 చొప్పున ఈఎస్ఐ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈపీఎఫ్ రూ.2.50 లక్షలు, ఈఎస్ఐ రూ.7లక్షలను త్వరలో అందిస్తామని, జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ తరపున బాధిత కుటుంబానికి రూ.30 లక్షలు మంజూరు చేస్తామని కమిషన్ చైర్మన్ ప్రకటించారు. కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్వో నర్సింహులు, సీఐ రవీందర్ రెడ్డి, మృతుడి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దవాఖానల్లో కాన్పులు పెంచాలి

- సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

సమీక్షా సమావేశానికి హాజరైన అధికారులు

(ఇన్‌సెట్లో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి)

సిద్దిపేట/ సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబరు 19: ప్రభుత్వ దవాఖానల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి అన్నారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఆరోగ్యసేవలు, వైద్యాధికారుల పనితీరుపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో అంధత్వ నివారణ కోసం జిల్లాలోని 26 మండలాల్లో హైదరాబాద్ శంకర కంటి దవాఖాన ఆధ్వర్యంలో క్యాంపు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో సుమారు 3,750 మంది క్యాట్రాక్ట్ సర్జరీలు అవసరమని, ప్రతి మండలంలో వీరందరికీ ప్రతి గురువారం సర్జరీలు నిర్వహిస్తామన్నారు. దవాఖానల్లో ఓపీ /ఐపీ సంఖ్య పెంచాలని, పిల్లలు, గర్భిణులకు వందశాతం వ్యాధి నిరోధక టీకాలు వేయాలన్నారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కార్యక్రమం ద్వారా జిల్లాలో 85శాతం ఓపీ ఉందని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 70శాతం పెంచేందుకు దృష్టి సారించాలని సూచించారు. ఈ – సంజీవనిలో కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వెనకబడి ఉన్నాయని, వాటిపైన దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. మాతా, శిశు సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా తల్లీబిడ్డలపైన ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అన్ని ప్రభుత్వ దవాఖానల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని, ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళా క్లినిక్‌కు వచ్చే మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ పల్వన్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ నారాయణరావు, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఆనంద్, డాక్టర్ అరుణ్‌కుమార్, డాక్టర్ శ్రీకళ, డాక్టర్ శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీళ్లు వేతనాలు మహాప్రభో!

- నాలుగు రోజులుగా నీటి కోసం తిప్పలు పడుతున్న ప్రజలు
- వేతనాలు ఇవ్వాలంటూ మిషన్ భగీరథ ఉద్యోగుల ఆందోళన
- 15 నెలలుగా ఉద్యోగులకు అందని వేతనాలు
- పట్టించుకోని ప్రభుత్వం

సంగారెడ్డి జిల్లాలో పల్లెలకు మిషన్ భగీరథ నీళ్లు బంద్

బుధేరాలో మిషన్ భగీరథ ట్యాంకు వద్ద ఉద్యోగులతో మాట్లాడుతున్న అధికారులు

మునిపల్లి, డిసెంబర్ 19: పల్లెలకు మిషన్ భగీరథ నీళ్లు బంద్ అయ్యాయి. నాలుగు రోజులుగా నీటి కోసం ప్రజలు, వేతనాల కోసం మిషన్ భగీరథ ఉద్యోగులు తిప్పలు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. సంగారెడ్డి జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల ప్రజలు మిషన్ భగీరథ నీళ్లు కోసం నానా అవస్థలు పడుతున్నారు. మిషన్ భగీరథలో విధులు నిర్వహిస్తున్న 180 మంది ఉద్యోగులకు 15 నెలల నుంచి వేతనాలు ఇవ్వకపోవడంతో మూడు రోజులుగా ఉద్యోగులు ధర్నాకు దిగారు. మునిపల్లి మండలంలోని బుధేరా చౌరస్తాలోని మిషన్ భగీరథ మెయిన్ ట్యాంకు వద్ద తాగునీళ్ల సరఫరా బంద్ చేసి ఉద్యోగులు ధర్నాకు దిగారు. దీంతో సంగారెడ్డి, పటాన్‌చెరు, అందోల్, జహీరాబాద్ నియోజకవర్గాల్లోని ప్రజలకు తాగునీరు సరఫరా నిలిచిపోయింది. మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని సమాచారం అందుకున్న ఉన్నతాధికారులు ఉద్యోగులు చేపడుతున్న ధర్నా వద్దకు చేరుకొని, సమస్యలు పరిష్కరించేందుకు ప్రయత్నం చేసినా ఉద్యోగులు వినిపించుకోకుండా ధర్నా చేపడుతున్నారు. సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు, సంగారెడ్డి, అందోల్, జహీరాబాద్‌లోని పలు గ్రామాలకు మునిపల్లి మండలంలోని బుధేరా గ్రామ శివారులోని మెయిన్ ట్యాంకు నుంచే నీటి సరఫరా అందుతుంది. అక్కడ సరఫరా నిలిపివేయడంతో నాలుగు నియోజకవర్గాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఉద్యోగులతో చర్చలు

మిషన్ భగీరథ ఉద్యోగులతో జిల్లా అధికారులు చర్చలు మొదలు పెట్టారు.15 నెలలకు సంబంధించి వేతనాలు ఇప్పుడు ఇవ్వలేం. ప్రభుత్వంతో మాట్లాడి ఆరు నెలల వేతనాలు ఇచ్చేందుకు కృషి చేస్తామని ఉద్యోగులకు భరోసా కల్పించే ప్రయత్నం చేశారు. కానీ, మిషన్ భగీరథ ఉద్యోగులు మాత్రం మొత్తం వేతనాలు చెల్లించే వరకు ధర్నా కొనసాగిస్తామని అధికారులకు తేల్చిచెప్పారు. మిషన్ భగీరథ ఉద్యోగులకు నచ్చజెప్పే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

తాగునీటి ఇక్కట్లు

బొంతపల్లిలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీక్ కావడంతో నీటిని పట్టుకుంటున్న ప్రజలు

గుమ్మడిదల, డిసెంబర్ 19: మిషన్ భగీరథ, పంచాయతీ పైప్‌లైన్ లీక్‌కావడంతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి పంచాయతీ పరిధిలో మిషన్ భగీరథ పైప్‌లైన్, పంచాయతీకి చెందిన తాగునీటి పైప్‌లైన్ లీక్ కావడంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. మూడు రోజులుగా మిషన్ భగీరథ, పంచాయతీకి చెందిన తాగునీటి పైప్‌లైన్ లీక్‌కావడంతో స్థానికులు లీక్ అయిన నీటిని రోడ్లపైనే పట్టుకుంటున్నారు. మిషన్ భగీరథ అధికారులు, పంచాయతీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో తాగు నీరు వృథాగా పోతుంది. ప్రత్యేకాధికారుల పాలనలో ప్రజలు పడరానిపాట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తాగునీటి గోసను పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

రాయపోల్, డిసెంబర్ 19: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకొని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలోని వడ్డేపల్లి, దోడ్లపల్లి శివారులో గురువారం రాత్రి అధికారులు తనిఖీలు చేపట్టగా రేషన్ బియ్యంతో వెళ్తున్న బొలేరో వాహనాన్ని పట్టుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ విషయంపై రాయపోల్ తహసీల్దార్ దివ్య, మండల ఆర్ఐ భాన్‌ప్రకాశ్‌ను వివరణ కోరగా.. రేషన్ బియ్యం పట్టుకున్న విషయం వాస్తవమేనని, వాటిని శుక్రవారం ఉదయం పంచనామా నిర్వహించి పూర్తి వివరాలు అందిస్తామని తెలిపారు. మండలంలోని వడ్డేపల్లి కేంద్రంగా అక్రమంగా నిత్యం రేషన్ బియ్యం తరలిస్తున్నప్పటికీ మండల స్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. నియంత్రించాల్సిన సంబంధిత అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడడంతో రైస్‌మిల్లు వ్యాపారులు కొత్త ఎత్తుగడతో కోళ్లఫారాలు, పాత ఇండ్లలో పీడీఎస్ బియ్యాన్ని నిల్వచేసి విక్రయిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మిల్లర్లతో అధికారులు కుమ్మక్కవడంతోనే రేషన్ బియ్యం దందా మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతున్నదని, ఈ విషయంలో జిల్లా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకొని రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.